రేషన్ కార్డులు ఇంకెప్పుడు?

- కొత్త రేషన్‌కార్డుల ఊసెత్తని ప్రభుత్వం
- సచివాలయం చుట్టూ పేదల ప్రదక్షిణలు
- సంక్షేమ పథకాలు అందవని ఆందోళన

గడివేముల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా రేషన్ కార్డులపై ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అర్హులైన పేదలు కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పడంతో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఓ పక్క కొత్త కార్డులు ఇవ్వకపోగా, ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పులు అనుమతి కూడా ఇవ్వకపోవడంతో కూటమి ప్రభుత్వంపై అర్హులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 14 సచివాలయాల పరిధిలోని 32 షాపులకు గాను 13608 రేషన్ కార్డులలో 39464 మంది సభ్యులు ఉన్నారని రెవెన్యూ అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంత వరకు ఎటువంటి రేషన్ కార్డులకు సంబంధించిన ఆన్‌లైన్‌లో సేవలు లేవు. ప్రతి సోమవారం మండల, జిల్లా స్థాయిలలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో రేషన్‌కార్డుల సమస్యలే అధికంగా వస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ పాలనలో నిరంతర ప్రక్రియ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు అందేవి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హుల ఇళ్ల వద్దకే వెళ్లి దరఖాస్తు చేయించే వారు. ఎవరితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా వచ్చేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. వలంటీర్ల వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్థాయిలో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తుందే తప్ప ప్రజలకు ఒక్క పని కూడా కావడం లేదు. తొమ్మిది నెలల్లో ఎందరికో వివాహాలు అయ్యాయి. కుటుంబంలో కొత్త సభ్యులు వచ్చారు. వీరంతా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హత ఉన్నా రేషన్ కార్డు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మళ్లీ పాత కష్టాలే ?

2014–2019 మధ్య టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ ఇదే విధంగా రేషన్‌కార్డులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేసింది. అప్పట్లో కొత్త రేషన్ కార్డులు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ అర్హులు ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఈ కారణంతో ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఇవే కష్టాలు ఏర్పడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డుల దరఖాస్తులకు అనుమతి వచ్చినా గ్రామ నేతల సిఫారసులు ఉంటేనే కార్డులు వస్తాయని చర్చించుకుంటున్నారు.

మండలంలో ఇలా..	
సచివాలయాలు	14
రేషన్ షాపులు	32
రేషన్‌కార్డులు	13,608
కార్డుల్లో సభ్యులు	39,464

ప్రభుత్వం నుంచి సమాచారం లేదు



కొత్త రేషన్ కార్డు జారీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. నిబంధనల ప్రకారం ఆదేశాలు వచ్చిన వెంటనే అర్హులందరికీ మార్గదర్శకాల ప్రకారం కార్డులు అందేలా చూస్తాం.

– వెంకటరమణ, తహసీల్దార్, గడివేముల

మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వాలి

రేషన్‌కార్డుల కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా నేటికీ కొత్తకార్డుల మంజూరుపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీలైనంత త్వరగా కార్డులు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలి. రేషన్‌కార్డులు కొత్తగా మంజూరు కాకపోవడంతో నిరుపేదలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

– వంగాల మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ–1, గడివేముల

రేషన్ కార్డు ఎంతో అవసరం

పిల్లల చదువులతో పాటు ప్రతి పనికి రేషన్ కార్డు అవసరం ఉంటుంది. రేషన్‌కార్డులలో పిల్లల పేర్లు నమోదు చేసుకోవడానికి ఇప్పటి వరకు అవకాశం ఇవ్వలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదినెలలైనా ఇప్పటి వరకు ఆన్‌లైన్ పనిచేయడం లేదనే సమాధానం అధికారులు చెబుతున్నారు. కార్యాలయాల చుట్టు తిరుగుతున్న ప్రభుత్వానికి కనికరం లేదు. ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్‌కార్డులతో పాటు కార్డులో పేర్లను నమోదు కార్యక్రమం చేపట్టాలి.

– జయన్న, గడివేముల

క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.15.37 లక్షలు



హుండీల్లోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని శైవక్షేత్రమైన కొత్తూరు సుబ్బరాయుడి హుండీలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపును గురువారం నిర్వహించారు. గత కొన్ని నెలల నుంచి భక్తులు సమర్పించిన కానులను లెక్కించగా హుండీ ఆదాయం రూ.15.37 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. కానుకల లెక్కింపును పర్యవేక్షణాధికారి జనార్దన్ పర్యవేక్షించారు.

పకడ్బందీగా రీసర్వే



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండలంలో రీ సర్వే పనులు పకడ్బందీగా జరుగుతుందని మండల సర్వేయర్ నాగభూషణం తెలిపారు. గురువారం సి.బెళగల్ గ్రామంలోని సర్వే నెంబర్ 258లో ఎనిమిదవ బ్లాక్‌లో జరుగుతున రీ సర్వేను ఆయన పరిశీలించారు. రైతుల సమక్షంలో కొలతలను తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండ సర్వే వివరాలు నమోదు చేయాలని స్బిబందికి సూచించారు.

పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం: పొదుపు మహిళలను ఆర్థికాభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పాణ్యం పొదుపు కార్యాలయంలో గురువారం డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి జీవనోపాధి ప్రణాళిక తయారు చేయడంపై శిక్షణ ఇచ్చామన్నారు. గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బంది మహిళల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు పరిశీలన

పాణ్యం: ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ కళాశాలకు ప్రత్యేక రహదారి ఏర్పాటు చేయడం కోసం వినతులు రావడంతో గురువారం తహసీల్దార్ నరేంద్రనాథ్రెడ్డి ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఇదిలా ఉండగా రహదారి లేకపోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని బత్తిని ప్రతాప్ డిమాండ్ చేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

సి.బెళగల్: విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఆదామ్‌బాషా అన్నారు. గురువారం ఆయన తిమ్మందొడ్డి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిసరాలను, తరగతి, వంట గదులను పరిశీలించారు. అదేవిధంగా పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నేతలు ..అధికారంలోకి రాగానే వాటిని వేగంగా బిగిస్తున్నారన్నారు. వీటివల్ల ప్రజలకు ఎక్కువ విద్యుత్ చార్జీ వస్తోందన్నారు. అలాగే అధికారంలోకి రాగానే రూ.17 వేల కోట్ల ట్రూఅప్ చార్జీల భారం ప్రజలపై వేశారన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యుత్ సౌధాను ముట్టడిస్తున్నట్లు చెప్పారు.

ఆప్కోలో 30 శాతం డిస్కౌంట్

కర్నూలు(అగ్రికల్చర్): ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పర్వదినాలతో పాటు వివాహాది శుభకార్యాలు ఉన్న నేపథ్యంలో జిల్లాలోని ఆప్కో షోరూమ్‌లలో కొత్త డిజైన్లతో చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు డివిజినల్ మేనేజర్ మధుబాబు తెలిపారు. బందరు, రాజమండ్రి, మాధవరం చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, పొందూరు దోవతులు, షర్టింగ్స్, లుంగీలు, టువాళ్లు, డ్రస్ మెటీరియల్ తదితర వస్త్రాలు వచ్చాయని గురువారం తెలిపారు. ఎంపిక చేసిన వస్త్రాలపై 50 శాతం వరకు భారీ తగ్గింపు ఉందన్నారు.

ఈకేవైసీ గడువును పెంచాలి



తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రమిస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: రేషన్ కార్డుదారుల ఈకేవైసీకి ప్రభుత్వం మరింత గడువును పెంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం కార్డుదారుల ఈకేవైసీ గడువును మరింత పెంచాలని కోరుతూ కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు కృష్ణ మాట్లాడుతూ రేషన్ బియ్యం ఏ ప్రాంతంలోనైనా తీసుకోవచ్చునని ప్రకటించిన ప్రభుత్వం కార్డుదారుల ఈకేవైసీ మాత్రం సొంత గ్రామాల్లోనే చేసుకోవాలని నిబంధన పెట్టడం దారుణమన్నారు. ఈకేవైసీకి నెలాఖరు వరకు మాత్రమే గడువు ఇవ్వడం వల్ల చాలా మంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈకేవైసీకి ప్రభుత్వం మరో మూడు నెలల గడువు ఇవ్వడంతో పాటు, ఈకేవైసీ సమాచారాన్ని ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ కార్డుదారులంతా ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదని, కేవలం కొందరి కార్డుదారుల పేర్లు మాత్రమే లిస్టులో వచ్చాయని, వారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, మునిస్వామి, ఆచారి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐఓ దిష్టిబొమ్మ దహనానికి యత్నం

- కలెక్టరేట్ ఎదుట తీవ్ర ఉద్రిక్తత
- ఏఐఎస్ఎఫ్ నాయకులను అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు కలెక్టరేట్ ఎదుట తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆర్ఐఓ గురవయ్య శెట్టి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, విద్యార్థి సంఘాల మధ్య తోపులాట జరిగింది. చివరకు పోలీసులు విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేసి మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. పోలీసు రాజ్యం నడుస్తోందని, ఎవరైనా ఏమైనా మాట్లాడితే అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆర్ఐఓ గురువయ్య శెట్టి ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్ కాలేజీల యాజమాన్యాలతో కలిసిపోయి అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయన్ను సస్పెండ్ చేసే వరకు పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. నాయకులు శరత్‌కుమార్, అభి, అశోక్, అక్షర, ముని, నాని, శీను, వీరేష్, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



బహుమతుల ప్రదానం చేస్తున్న రెక్టార్ ఎన్‌కేటీ నాయక్, రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు

కర్నూలు కల్చరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌కేటీ నాయక్ సూచించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్ ఉద్భవ్–2025 కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతికతపై అవగాహన పెంచుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జీవీఎం మోహన్‌కుమార్

కర్నూలు సిటీ: రవీంద్ర, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలు సంయుక్తంగా బిజినెస్ ఐడియాతాన్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, మురళీధర్ రెడ్డి (ఆచార్యులు, కేంబ్రిడ్జ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బెంగళూరు) హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్ మాట్లాడుతూ స్టార్టప్‌లను ప్రోత్సహించడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో ముందుకు వస్తే అందులో పెట్టుబడి పెట్టేందుకు యాజమాన్యం ముందుటుందన్నారు. అనంతరం మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు లాభాలు తెచ్చే విధంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ కేఈ శ్రీనివాస మూర్తి, డాక్టర్ సి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పూదోట కాదు..

ఈ చిత్రంలో కనిపిస్తున్నది పూల తోట కాదు. ఉల్లి విత్తనాల కోసం రైతు సాగు చేసిన పంట ఇది. ఈ ఇలాంటి దృశ్యాలు బస్తిపాడు, చిన్నకొట్టాల రోడ్డులో కనిపిస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో ఉల్లి సాగు చేసేందుకు విత్తనాల కోసం అవసరమైన రైతులు పంట వేశారు. వర్షాలు అనుకూలిస్తే పడి ఉల్లి విత్తనాలు రూ. 1,000 నుంచి 1,200 వరకు ఉంటుంది. – కల్లూరు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): శివరామపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభిచారు. రూ.8 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే దారి, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, సచివాలయ ఇంజినిరింగ్ అసిస్టెంట్ శారద తెలిపారు.

ఖురాన్ పంపిణీ



ఖురాన్‌ను పిల్లలకు అందజేస్తున్న దృశ్యం

గడివేముల: మంచాలకట్ట గ్రామ మదరసాలో విద్యనభ్యసించే చిన్నారులకు ఖురాన్, ముసల్లా, టజీబీ, అత్తర్, ఖరాన్‌పెట్టె వస్తువులను గడివేముల గ్రామానికి చెందిన దూదేకుల మాబాషా గురువారం అందజేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రార్థనల అనంతరం ఖరాన్ చదువుతున్న పది మంది పిల్లలకు వాటిని అందజేసినట్లు హాఫీజ్ జాఫర్ ఉశేన్ తెలిపారు.

రక్షణ కల్పించండి

కర్నూలు: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పడిగెల రాజశేఖర్ నుంచి తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించాలని అదే ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఎం.లిల్లెమ్మ గురువారం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. రాజశేఖర్ తాను 17 సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నామని, అతని కోసం రూ.15 లక్షల నగదు, 12 తులాల బంగారం ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాజశేఖర్, అతని అన్నదమ్ముల వల్ల తనకు, తన పిల్లలకు హాని పొంచి ఉందని రక్షణ కల్పించాలని కోరారు.

ఎన్నికల కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

కర్నూలు: జిల్లాలో జెడ్పీ కో–ఆప్షన్, మండల పరిషత్ కో–ఆప్షన్ ఉప సర్పంచు స్థానాలకు ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో పటిష్టమైన పోలీ సు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షిస్తూ ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా ఎన్నికలు సజావుగా జరిగే విధంగా భద్రతాపరమైన చర్య లు చేపట్టినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు.

ఇద్దరు వైద్యులకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరు వైద్యులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్న తి లభించింది. వీరికి గురువారం జూమ్ ద్వారా డీఎంఈ డాక్టర్ నరసింహం పదోన్నతి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి అనంతపురానికి, డాక్టర్ శ్రీదేవి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు.

పీఆర్‌సీ కమిటీ చైర్మన్‌ను నియమించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చి న హామీ మేరకు ఐఆర్‌ను ప్రకటించాలని, 12వ పీఆర్‌సీ కమిటీ చైర్మన్‌ను ఏర్పాటు చేయాలని అప్టా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, సేవలాల్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సరెండర్ లీవ్‌లు, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2004 సెప్టెంబర్‌కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అలాగే ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీస్ 62 ఏళ్లకు పెంచి రెగ్యులర్ చేయాలని కోరారు.

అంబేడ్కర్ జయంతిఘనంగా నిర్వహిస్తాం

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెలుగు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మీడి యా భవన్ సమీపంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు వీరాంజనేయులు, రాము, జమ్మన్న, రమేష్, శేఖర్, పరశురాం, నాగేంద్ర, లోకేష్, గొల్ల శేఖర్ పాల్గొన్నారు.

పెసరవాయి ఉప సర్పంచ్‌గా వెంకటసుబ్బయ్య



గడివేముల: పెసరవాయి ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు, వార్డు మెంబర్–2 వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్‌గా ఉన్న సాయి సుధా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఎన్నిక నిర్వహించినట్లు ఈఓపీఆర్‌డీ మహీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సచివాయంలో వార్డు సభ్యులతో ఉప సర్పంచ్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ 4వ వార్డు సభ్యుడు ద్వారం శ్రీకాంత్‌రెడ్డి వెంకటసుబ్బయ్యను బలపరచగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికై న ఉపసర్పంచ్‌కు ఎలక్షన్ అధికారి డిక్లరేషన్‌ను అందించారు. అనంతరం ఉప సర్పంచ్‌ను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగేష్, వీఆర్వో హరీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుట్టపాడు ఉపసర్పంచ్‌గా లక్ష్మీదేవమ్మ

ఓర్వకల్లు: గుట్టపాడు ఉప సర్పంచ్ స్థానానికి వార్డు సభ్యురాలు లక్ష్మీదేవమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి సుబ్బరాయుడు తెలిపారు. గ్రామంలో మొత్తం 8 వార్డు సభ్యులకు గాను అప్పట్లో మహబూబ్‌బాషాను ఉప సర్పంచుగా ఎన్నుకున్నారు. అయితే ఆయన ఎన్నకల అనంతరం తమ పదవికి రాజీనామా చేశారు. ఖాళీ ఏర్పడిన ఆ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా లక్ష్మీదేవమ్మను ఉప సర్పంచ్‌గా అనే వార్డు సభ్యులు బలపరిచారు.

సుంకేసుల ఉప సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని సుంకేసుల గ్రామ ఉప సర్పంచ్‌గా వడ్డె నీలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో గురువారం మండల ప్రాథమిక పాఠశాలలో ఎన్నిక నిర్వహించగా రెండవ వార్డు మెంబర్ వడ్డె నీలమ్మను 10 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి రంగస్వామి డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ జాకీర్ హుస్సేన్, సర్పంచ్ గిడ్డమ్మ పాల్గొన్నారు.



ఇలాగైతే రోగాలు రావా?

ప్రతి వారం స్వచ్ఛాంధ్ర అంటూ ర్యాలీలు నిర్వహించే అధికారులు పల్లెల్లో నెలకొన్న అపరిశుభ్రతపై చర్యలు తీసుకోవడం లేదు. కొత్తూరు ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందర మురుగు నీరు నిలిచి పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు వెళ్లే డ్రైనేజీ కాల్వలు లేకపోవడంతో నిత్యం ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు. కాలనీ పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు బాబయ్య, వీరన్న వాపోతున్నారు. – కోడుమూరు రూరల్

లెప్రసీ బాధితులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్త కుమార్‌నాయక్

కర్నూలు(హాస్పిటల్): లెప్రసీ వ్యాధిగ్రస్తులకు వివక్ష లేకుండా సేవలందించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఢిల్లీ) ప్రత్యేక పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్ సూచించారు. ఆయన గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలు, వారి హక్కులపై జిల్లా సమన్వయ కమిటీ అధికారులతో చర్చించారు. వారికి ఇంకా మెరుగైన సేవలు అందించేలా సూచనలు చేశారు. అనంతరం కర్నూలులోని ఆదర్శ కాలనీని సందర్శించి లెప్రసీ బాధితులు ఎంత మంది ఉన్నారు, వారికి ఏఏ పథకాలు అందుతున్నాయి, వారికి గుర్తింపు, ఆధార్ కార్డులు ఉన్నాయా అనే వివరాలు సేకరించారు. అనంతరం నందికొట్కూరు రోడ్డులోని అభయగిరికి వెళ్లి లెప్రసీ బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. జాయింట్ డైరెక్టర్(ఎన్ఎల్ఈపీ) డాక్టర్ సాగర్, డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, కర్నూలు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో విశ్వావసు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి పేర్కొన్నారు. ఆరేపల్లి వరలక్ష్మమ్మ, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, ఎలమర్తి భావన, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ బీవీ స్వరూప్‌సిన్హా, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, దాసరి వెంకట రమణ, మద్దిలేటి, మీసాల రఘు, కృష్ణమూర్తి, సయ్యద్ జహీర్ అహమ్మద్ తదితర కవులు పాల్గొని విశ్వావసు నామ సంవత్సర ఉగాదిపై కవితలు వినిపిస్తారని పేర్కొన్నారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనవచ్చని తెలిపారు.